జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 6 | సెప్టెంబర్ | 2026 • పేజీలు : 10


## బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో ఎమ్మెల్యే



**ఇల్లందు, సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి)** మండలంలోని సుభాష్ నగర్ గ్రామ పంచాయతీలో నూతనంగా ప్రతిష్టిస్తున్న బొడ్రాయి (నాభిశీల), ముత్యాలమ్మ తల్లి అమ్మవార్ల ప్రతిష్టకు గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు శనివారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కుటుంబ సమేతంగా హాజరై పుజా కార్యక్రమాలు నిర్వహించచారు. ఆలయ కమిటి అధ్వర్యంలో

మిగతా 2 లో...

- మణుగూరులో రక్తపుటేరులు..!
- మరో ఉత్తరప్రదేశ్ గా మారానున్న మణుగూరు.?
- ఎం.కె.గ్యాంగ్ హత్య మరువకముందే మళ్లీ పోలీస్ స్టేషన్ సాక్షిగా బాహాబాహీ - భయంలో మణుగూరు ప్రజలు..!
- మణుగూరులో శాంతిభద్రతలు పూర్తిగా విఫలం...
- వరుస ఘర్షణలతో ప్రజల్లో వణుకు..!
- ప్రజాజ్యోతి ప్రతినిధిపై ఎస్సై అరాచకం - ప్రతినిధి ఫోన్ గుంజుకొని ఫోటోలు ఎందుకు తీశావ్ అంటు డిలీట్ చేయాలని బెదిరింపు.!
- వార్త కధనం కోసం ఫోటోలు తీస్తే నేరమా.?
- మణుగూరులో పత్రికా స్వేచ్ఛపై పోలీస్ దాడి.!
- పోలీసులు ఉన్నారా? లేరా? అని స్థానికుల ప్రశ్న.!
- ఒక వైపు హత్య..మరో వైపు ఘర్షణ..ఇంకో వైపు విలేకరిపై బెదిరింపు...
- విధుల్లో మణుగూరు పోలీస్ పూర్తిగా ఫెయిల్యూర్..!
- జిల్లా ఎస్పీ జోక్యం చేసుకోవాలని కోరుతున్న మణుగూరు ప్రజలు..!



# మణుగూరులో..... రక్తపుటేరులు..!

5 లో..

**భద్రాద్రి కొత్తగూడెం క్రైమ్ ప్రతినిధి/ మణుగూరు (ప్రజాజ్యోతి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. నిన్న మొన్నటి వరకు ప్రశాంతంగా ఉండే మణుగూరు పట్టణం ఇప్పుడు నేరాలకు, గ్యాంగ్ వార్ లకు అడ్డాగా మారింది. కొద్ది రోజుల క్రితమే ఎంకె గ్యాంగ్ చేతిలో శివ అనే యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన మరువకముందే, నడిరోడ్డుపై మరోసారి యువకులు రక్తం వచ్చేలా కొట్టుకోవడం కలకలం రేపుతోంది. అందరు చూస్తూ ఉండగానే ఓ ఆటో డ్రైవర్, మ్యాజిక్ ట్రాలీ డ్రైవర్ నడిరోడ్డుపై బాహిబాహిగా కొట్టుకొని రక్తపుటేరులు పారిస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని...? ప్రజలు విమర్శలు కురిపిస్తున్నారు.

## ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణానికి మార్గదర్శకం..

- విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకం...
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుకు కృషి...
- మణుగూరు జడ్పీహెచ్ఎస్ లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు...
- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు...




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. /మణుగూరు, సెప్టెంబర్ 05 (ప్రజాజ్యోతి)** ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణానికి మార్గదర్శకమని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్రే కీలకమని పినపాక ఎమ్మెల్యే పాయం

మిగతా 2 లో...

## విద్యా వికాసానికి 'మన ఎమ్మెల్యే—మన బడి'

- ఐదు మండలాల ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం
- విద్యే సమాజ పునర్నిర్మాణానికి బలమైన పునాది: ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



**దమ్మపేట, సెప్టెంబర్ 05, (ప్రజాజ్యోతి):** విద్యే సమాజ అభివృద్ధికి మూలమనే లక్ష్యంతో నియోజకవర్గంలో విద్యారంగానికి కొత్త దిశానిర్దేశం చేసే కార్యక్రమానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శ్రీకారం చుట్టారు. 'నేను సైతం చేయూత—విద్యా యాత్ర: మన ఎమ్మెల్యే—మన బడి' కార్యక్రమాన్ని ఘనంగా ఘనంగా ప్రారంభించారు.చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట మండలాల విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విశేష కృషి చేసిన ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు.ఈ సందర్భంగా ఐదు మండలాల్లో విద్యారంగానికి విశేష సేవలందించిన ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే జారె

మిగతా 2 లో...

## బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో ఎమ్మెల్యే





(మొదటి పేజీ తరువాయి...)

భక్తులకు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణను కుటుంబ సమేతంగా పాల్గొని ప్రారంభించారు. ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఇల్లందు నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలు, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నారు. అనంతరం బిఆర్ఎస్ రాజ్యసభ పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజు రవిచంద్ర బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరయ్యారు. రాష్ట్ర ప్రజలతో పాటు ఇల్లందు నియోజకవర్గ ప్రజలకు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బానోత్ రాంబాబు, సర్పంచ్ వల్లాల మంగమ్మ నర్సయ్య, నాయకులు వడియాల చిట్టిబాబు, ఆళ్ల నాగేశ్వరరావు, రామచందర్, అల్లాడి నర్సింహరావు, సొసైటి డైరెక్టర్ కునుసోత్ రాము, మాజీ ఎంపిటిసి పూనెం సురేందర్, నాయకులు తాటి భిక్షం, శ్రీను, దండుగుల శివ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణానికి మార్గదర్శకం..





(మొదటి పేజీ తరువాయి...)

వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మణుగూరు మండలం లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. గురువులు కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందిస్తున్నారని కొనియాడారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీ అని తెలిపారు.విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. పినపాక నియోజకవర్గం లో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి, విద్యా ప్రమాణాల పెంపుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ,ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# నిశ్శబ్ద విప్లవం: ఒక జర్నలిస్ట్ సత్య యజ్ఞం

- వార్త అంటే ట్రెండ్ కాదు... అదొక జీవితం!
- కలం సాక్షిగా... నిజాన్ని పరిచయం చేసే అర్ధరాత్రి పోరాటం
- అణచివేతకు అక్షర రూపం: వార్త వెనుక ఉన్న అసలు సత్యం



**ప్రజా జ్యోతి అశ్వరావుపేట సెప్టెంబర్ 5** రాత్రి రెండు గంటల సమయం. ప్రింటింగ్ ప్రెస్ లోంచి వచ్చే భారీ యంత్రాల చప్పుడు కింది అంతస్తు నుంచి ఒక గుండె చప్పుడులా వినబడుతోంది. టేబుల్ మీద వెలుగుతున్న చిన్న ల్యాంప్ వెలుతురులో, ఖాళీ కాగితం వైపు చూస్తూ కూర్చున్న మహేష్ చేతిలోని పెన్ను క్షణం పాటు ఆగిపోయింది. ఈ డిజిటల్ యుగంలో వార్త అంటే కేవలం సెకన్ల వ్యవధిలో మారే ఒక ట్రెండింగ్ హ్యాష్‌ట్యాగ్ కావచ్చు, కానీ ఒక నిజమైన జర్నలిస్టుకు అది ఒక జీవితం, సమాజం ముఖం మీద పడే స్పష్టమైన నీడ. వార్తను ఉన్నది ఉన్నట్లు రాయడం తేలికే, కానీ నిజాన్ని శోధించి దానికి అక్షర రూపమివ్వడం ఒక నిశ్శబ్ద పోరాటం. సమాజం నిద్రపోతున్న వేళ, సత్యాన్ని మేల్కొలిపే బాధ్యతను మోయడమే జర్నలిజం అసలైన ఆత్మ. ఒక మంచి జర్నలిస్ట్ కేవలం సమాచారాన్ని అందించే ప్రవక్త కాదు, అతడు కాలానికి సజీవ సాక్షి. అధికారం ఇచ్చే ఒత్తిళ్లు, సోషల్ మీడియా సృష్టించే నకిలీ మాయాజాలం, స్వార్థ ప్రయోజనాల నడుమ నిష్పాక్షికంగా నిలబడటం సామాన్యమైన విషయమేమీ కాదు. సత్యసంధత అనేది అతనికి ఆయుధం అయితే, నిర్భయత్వం కవచం లాంటిది. సంఘటనల వెనుక ఉన్న అసలు కోణాలను తవ్వి తీయడానికి రాత్రనకా పగలనకా శ్రమించే పరిశోధనాత్మక దృష్టి, ప్రతి అక్షరంలోనూ కనిపించే నైతిక బాధ్యత అతడిని సమూహంలో భిన్నంగా నిలబెడతాయి. అర్ధరాత్రి వచ్చే బెదిరింపు ఫోన్ కాల్స్, ఆర్థిక లోటుపాట్లు, అధికార వర్గాల హెచ్చరికలు... ఇవన్నీ అతని నిబద్ధత ముందు చిన్నబోవాల్సిందే. ఎందుకంటే, జర్నలిస్ట్ రాసే ప్రతి వాక్యం భవిష్యత్తు తరాలకు చరిత్ర పుటల్లో ఒక తిరుగులేని సాక్ష్యంగా నిలిచిపోతుంది. ఈరోజు తను రాసే వార్త, రేపు ఉదయాన్నే వేలాది మంది పాఠకుల చేతుల్లోకి వెళ్లనుంది. ఒక అబద్ధం వెయ్యి మైళ్ళు ప్రయాణించే లోపే, నిజం తన చెప్పులు తొడుక్కుంటుంది అంటారు. కానీ ఆ నిజాన్ని నిరాటంకంగా లోకానికి పరిచయం చేయడానికి ఒక జర్నలిస్ట్ తన జీవితాన్ని, వ్యక్తిగత సుఖాలను పణంగా పెడతాడు. జర్నలిజం అనేది కేవలం ఒక జీవనోపాధి కాదు, అదొక సత్యశోధన, అణచివేతకు గురైన గొంతులకు అక్షర రూపాన్నిచ్చే ఒక పవిత్రమైన యజ్ఞం.

ఒక జర్నలిస్ట్ ఎన్నో ఒడిదురుకులను ఎన్నో బెదిరింపులను ఎదుర్కొని నిజాయితీ వైపు నిజం కోసం నిలబడి తన రాసిన వార్తను పంపిన తర్వాత ఆ రోజు తన రాసిన ఆఖరి వాక్యం పూర్తయ్యేసరికి ఆరోజు గడిచిన మరసటి రోజు తాను రాసిన వార్తను పాటకులు చూస్తారు అని ఆశతో ఎదురుచూస్తూ కిటికీ బయట తొలి సంధ్య వెలుగులు చిమ్ముతుండగా ప్రెస్ నుంచి వస్తున్న పత్రికల తాజా వాసన గాలిలో తన మనసు తేలివస్తోంది. నిజాయితీగా రాసిన ఈ ఒక్క వార్త, సమాజంలో కనీసం ఒక చిన్న మార్పునైనా తేగలదనే నమ్మకమే ఆ జర్నలిస్ట్ రాత్రింబవళ్ల అలసటను మాయం చేస్తుంది. వార్తలు వస్తాయి, కాలగర్భంలో కలిసిపోతాయి; కానీ నిజాన్ని గెలిపించడానికి పట్టిన ఆ కలం ఉన్నంతవరకు జర్నలిజం తన నిశ్శబ్ద విప్లవాలను సృష్టిస్తూనే ఉంటుంది.

ఒక అబద్ధం వెయ్యి మైళ్ళు ప్రయాణించే లోపే, నిజం తన చెప్పులు తొడుక్కుంటుంది." సమాజం నిద్రపోతున్న వేళ సత్యాన్ని మేల్కొలిపే బాధ్యతను మోస్తూ, తన సుఖాలను పణంగా పెట్టే ప్రతీ నిజాయితీగల జర్నలిస్టుకు ఈ కథ అంకితం!

మీలో ఒకడు మీతో ఒకడు అయినా మీ మహేష్ యాదవ్ ఆర్ సి రిపోర్టర్ అశ్వరావుపేట ప్రజా జ్యోతి

# విద్యా వికాసానికి 'మన ఎమ్మెల్యే–మన బడి'





(మొదటి పేజీ తరువాయి...)

ఆదినారాయణ ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పోషిస్తున్న పాత్రను ఆయన అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "విద్య పుస్తకాల్లోని జ్ఞానానికి మాత్రమే పరిమితం కాదు.. అది జీవితాలను మార్చే శక్తి. సమాజాన్ని కొత్త దిశగా నడిపించే ఆయుధం" అని అన్నారు. విద్య ద్వారా వ్యక్తిలో ఆలోచనా శక్తి, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. నాణ్యమైన విద్య మెరుగైన ఉపాధి అవకాశాలకు బాటలు వేయడమే కాకుండా కుటుంబాల ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతుందన్నారు.విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలుస్తున్న ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే కొనియాడారు. తరగతి గదిలో పాఠాలు బోధించడంతో పాటు విద్యార్థుల్లో మంచి విలువలు, బాధ్యత, సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తున్న ఉపాధ్యాయులను సమాజం ఎల్లప్పుడూ గౌరవించాలని అన్నారు.

### విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యావ్యవస్థ బలోపేతానికి అనేక కీలక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే తెలిపారు. 'అమ్మ ఆదర్శ పాఠశాలల' ద్వారా పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు ఉచితంగా రెండు జతల యూనిఫారాలు, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అందించినట్లు వివరించారు.పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, సివిల్స్ ప్రిలిమ్స్ సాధించిన వారికి 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయం' కింద రూ.లక్ష ఆర్థిక సాయం, గురుకులాల్లో మెస్, డైట్ ఛార్జీల పెంపు వంటి నిర్ణయాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడుతున్నాయని తెలిపారు.

### ఉపాధ్యాయ నియామకాలు.. ప్రమోషన్లకు ప్రాధాన్యం

ఉపాధ్యాయ రంగంలో 11,062 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించి నియామకాలు చేపట్టడం, ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ప్రమోషన్లు, పారదర్శక బదిలీల ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. భాషా పండితులు, పీఈటీ పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు సమగ్ర శిక్షా సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా, ప్రతి పాఠశాలలో మెరుగైన వాతావరణం ఉండేలా 'మన ఎమ్మెల్యే–మన బడి' కార్యక్రమం ద్వారా విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని జారె ఆదినారాయణ తెలిపారు.కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, సర్పంచులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టీబీ ముక్త భారత్ అభియాన్' ఉచిత వైద్య శిబిరం

- మొబైల్ ఎక్స్ రే ద్వారా 72 మందికి పరీక్షలు.. 10 మంది టీబీ అనుమానితుల గుర్తింపు



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద 'టీబీ ముక్త భారత్ అభియాన్'లో భాగంగా శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో టీబీ వ్యాధిని ముందస్తుగా గుర్తించి, సకాలంలో చికిత్స అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ లకావత్ లక్ష్మి శిబిరాన్ని ప్రారంభించారు. ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ నాజనీన్ తబస్సుమ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన డిజిటల్ మొబైల్ ఎక్స్ రే యూనిట్ ద్వారా పంచాయతీ పరిధిలోని 72 మందికి ఛాతీ ఎక్స్ రే పరీక్షలు చేశారు. పరీక్షల అనంతరం 10 మందిలో టీబీ అనుమానిత లక్షణాలను గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. వీరికి తదుపరి దశలో కళ్లె (స్పుటమ్), రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టీబీ నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉచిత మందులు, అవసరమైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. నిక్షయ్ పోర్టల్ ద్వారా టీబీ బాధితులకు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం నెలకు రూ.1,000 ఆర్థిక సాయం అందిస్తుందని వివరించారు.రెండు వారాలకు పైగా దగ్గు తగ్గకపోవడం, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రాత్రిపూట అధికంగా చెమటలు పట్టడం, కళ్లెంలో రక్తం పడటం, ఛాతీలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని డాక్టర్ నాజనీన్ తబస్సుమ్ సూచించారు. అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఇతర గ్రామాల్లోనూ మొబైల్ ఎక్స్ రే ద్వారా టీబీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈనెల 7న పెంట్లం గ్రామపంచాయతీలో, 9న అబ్బుగూడెం గ్రామపంచాయతీలో, 11న పెద్దిరెడ్డిగూడెం గ్రామపంచాయతీలో శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లకావత్ లక్ష్మి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాజనీన్ తబస్సుమ్, హెల్త్ ఎడ్యుకేటర్ జయలక్ష్మి, హెల్త్ సూపర్ వైజర్ ప్రకాశరావు, గ్రామపంచాయతీ కార్యదర్శి సురేష్, టీబీ సూపర్ వైజర్ వెంకట్, హెల్త్ అసిస్టెంట్ రామదాసు, ఏఎన్ ఎం పుష్పరాజ్యం, ఆశా కార్యకర్తలు బేబీ, కరుణ, కవిత, అనురాధ, నాగేశ్వరి పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా జనసేన

- దేశంలో అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా పవన్



**ఇల్లెందు, సెప్టెంబర్, 5 (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా జనసేన ఉండబోతుందని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్ అన్నారు. శనివారం ఇల్లెందులో ఏర్పాటు చేసిన జనసేన నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో అత్యధిక ప్రయోజన కలిగిన నేతగా పవన్ కళ్యాణ్ నిలిచారని పేర్కొన్నారు. ఎన్నికలలో సమర్థులను గుర్తించి టికెట్ ఇవ్వడం పవన్ ఆలోచనకు నిదర్శనమన్నారు. ప్రతి ఒక్కరికి న్యాయం చేయడమే పవన్ గొప్పతనమని తెలిపారు. ఇల్లందుతో తనకు అవినాభావ సంబంధం ఉందని, ఇల్లందు నుండే సింగరేణి సంస్థ ద్వారా దేశానికి వెలుగులు పంచిన నేల అని గుర్తు చేశారు. ఇల్లందు నియోజకవర్గ కొంతమేరకు మాత్రమే అభివృద్ధి చెందిందని తన వ్యక్తిగత అభిప్రాయమని, ఇల్లందు పట్టణం తప్ప తండాలు, గ్రామాల్లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే మొన్న చందంగా రోడ్లు, డ్రైనేజీ, ఇతర సమస్యలు అలానే పేరుకుపోయి ఉన్నాయని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఇల్లందు సంపదను బొగ్గు రూపంలో తరలించుకుపోయారే తప్ప వెళ్లేందుకు ఏమి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కరి పోరాటంతో తెలంగాణ రాష్ట్రం సిద్ధించలేదని 1200 మంది అమరుల ఆత్మ బలిదానాలు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి పునాదులు అయ్యాయని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో సాధించుకున్న రాష్ట్రంలో పదేళ్లు టిఆర్ఎస్ ప్రభుత్వం కుటుంబ పాలనతో రూ. లక్షల కోట్లు ఆర్జించిందని ఆరోపించారు. ఎవరు తీసుకున్న బొందలో వారే పడ్డట్లుగా పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు తిప్పి కొట్టారని పేర్కొన్నారు. ఇక దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వాన్ని ఎవరు బొందపెటాల్సిన అవసరం లేదని సొంత వాళ్లే కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేస్తారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా జనసేనను ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు. నీతి, నిజాయితీ, నిబద్ధతతో ముందుకు వెళ్తున్న జనసేన పార్టీకి ప్రజలు అండదండలుగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇప్పటికే జన సేనాదిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పవన్ కళ్యాన్ తనదైన శైలిలో ప్రజలకు సేవ చేస్తున్నారని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తీరుస్తూ దేశంలోనే అత్యున్నత నాయకుడిగా పేరు సంపాదించుకున్నారని స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో రహదారుల అభివృద్ధి లేదని గతంలో వైద్యం కోసం నానా పాట్లు పడ్డ గ్రామీణ ప్రాంతాలకు 108 అంబులెన్స్ ల ద్వారా ప్రజలకు వైద్యాన్ని ఇంటి వద్దకే చేర్చుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో నేటి ప్రజా ప్రభుత్వం భూ భారతి పేరుతో భూములను హరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో సిరులు కురిపించే సింగరేణి తల్లి పుట్టిన లైన ఇల్లెందుకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకనాడు సింగరేణి గనలతో కళకళలాడిన ఇల్లెందు నేడు గనులు లేక వేలవేల పోతుందని అందుకు కారణం పాలకులే అని మండిపడ్డారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కోసం ఇల్లెందు గిరిజన ప్రాంతం వాసులు హైదరాబాదుకు వలసలు వెళ్లే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఖమ్మం – నల్గొండ –వరంగల్ పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా జనసేన పార్టీ నుంచి పవన్ తన పేరును ప్రకటించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని వెనుకబడిన అభివృద్ధికి దూరంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను పట్టించుకునే పాలకులే కరువయ్యారని పేర్కొన్నారు. భవిష్యత్తులో జరగబోయే ప్రతి ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలో ఉంటుందని జనసేన పార్టీ అభివృద్ధి లక్ష్యంగా గ్రామీణ ప్రాంతం నుంచి నగర స్థాయి వరకు పార్టీని పటిష్టం చేయనున్నామని, అందులో భాగంగా రానున్న అక్టోబర్ లో పార్టీ కోసం కష్టపడే వారికి పదవులు దక్కుతాయన్నారు. వచ్చే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో జనసేన విజయం సాధించి తీరుతుందని అందుకు ప్రజలు అండగా నిలబడతారని నిలబడాలని కోరారు. రాష్ట్రంలో ఎరువులు కావాలంటే యాప్ ద్వారా బుక్ చేసుకోవాలని చెబుతూ వాటిని బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నారని ఆరోపించారు. జనసేన మేనిఫెస్టో అంటే భగవద్గీత, ఖురాన్, బైబిల్ తో సమానమని తెలిపారు. జూన్ 2 నవనిర్మాణ సభ పెట్టుకుంటే అనుమతి ఇవ్వకపోవడంతోనే రాష్ట్రంలో జనసేన ఆవిర్భవించాల్సిన సమయం ఆసన్నమైందని ఆలోచనతో పవన్ కళ్యాణ్ కార్యచరణ రూపొందించడం జరిగిందని తెలిపారు. నందు నియోజకవర్గ అభివృద్ధి కేవలం జనసేనతోనే సాధ్యమని, రాష్ట్రంలో బీసీ బిడ్డ ముఖ్యమంత్రి కావాలన్నదే జనసేన లక్ష్యమన్నారు. అనంతరం పలువురు జనసేన పార్టీలో త్వరగా వారికి పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ నాయకురాలు నాగ స్రవంతి, మిరియాల రామకృష్ణ, బండి శ్రీనివాస్, సాదిక్, పిఠాపురం నేత అమలేశ్వరి, బడుగుల శ్రీనివాస్, బానోత్ గోపి, మద్ది సాయికుమార్, బ్రహ్మం, శ్రీశైలం, హేమంత్, అవదుర్తి పద్మ, శ్రావణ్, జన్ను రావిష్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ బాకీ కార్డుల పంపిణీ

**చర్ల, సెప్టెంబర్ 05: (ప్రజా జ్యోతి ):** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ చర్ల మండల కమిటీ కన్వీనర్ దొడ్డి తాతారావు ఆరోపించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ హామీలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం చర్ల పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ 'బాకీ కార్డులు' పంపిణీ చేశారు.దొడ్డి తాతారావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని అయితే ప్రభుత్వం ఏర్పడి సుమారు 1000 రోజులు అవుతున్నా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. పాలన చేతకాక ప్రతిపక్ష నాయకుడు రాజీనామా చేయాలని అధికార పార్టీ నాయకులు మాట్లాడటం సరికాదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు ముందుగా అధికార పార్టీ నాయకులే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, యువజన విభాగం నాయకులు కాకి అనిల్, అంబోజి సతీష్, గోరింట్ల వెంకటేశ్వరరావు, వార్డు సభ్యుడు కట్టం కన్నారావు, గదెంశెట్టి కిశోర్, తడికల బుల్లెబాయ్, పసికంటి సంతోష్‌తో పాటు స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.



# నేడు పాల్వంచలో మిలాదున్నబీ కాన్ఫరెన్స్

- ఎండి యాకూబ్ పాషా




**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 5,(ప్రజా జ్యోతి)** మహ్మద్ ప్రవక్త జన్మదిన మాసం రబీఉల్ అవ్వల్‌ను పురస్కరించుకుని పాల్వంచలోని సబ్‌స్టేషన్ సమీపంలో నేడు (ఆదివారం) సాయంత్రం 5 గంటలకు మిలాదున్నబీ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు దారుల్ ఉలూం నూరియా హనఫియా హిఫ్జ్ మదర్సా చైర్మన్ ఎండీ యాకూబ్ పాషా తెలిపారు.శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఒడ్డుగూడెంలోని దారుల్ ఉలూం నూరియా హనఫియా హిఫ్జ్ మదర్సా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పలువురు ముఖ్య వక్తలు ప్రసంగించడంతో పాటు మదర్సా విద్యార్థులచే నాత్ షరీఫ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సబ్‌స్టేషన్ పక్కన మదర్సా అధ్యక్షుడు షేక్ యూసుఫ్ నివాసం వద్ద ఈ కాన్ఫరెన్స్ జరుగుతుందని పేర్కొన్నారు.కార్యక్రమానికి ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.కార్యక్రమం అనంతరం భోజన సౌకర్యం కల్పించడంతో పాటు మహిళల కోసం ప్రత్యేక పరదా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ సమావేశంలో మదర్సా అధ్యక్షుడు షేక్ యూసుఫ్,కోశాధికారి ఇక్బాల్,గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు. ఇతర వివరాలకు 9848362129, 8520860785 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

# జెడ్పీహెచ్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుక

- గురువుల సేవలు మరువలేనివి- ఎంపీడీఓ ఈదయ్య

**చర్ల, సెప్టెంబర్ 05: (ప్రజా జ్యోతి ):** చర్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పలక వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన చర్ల ఎంపీడీఓ ఈదయ్య మాట్లాడుతూ గురువు లేని విద్య గుడ్డి దీపం వంటిదని తల్లిదండ్రులు జన్మనిస్తే, గురువు జీవితాన్ని తీర్చిదిద్దుతారని అన్నారు . నేడు ఉన్నత స్థానాల్లో ఉన్న ప్రతి ఒక్కరి ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ప్రతి విద్యార్థికి ఆదర్శమని, విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఉపాధ్యాయులను గౌరవించే సంస్కారం ప్రతి విద్యార్థిలో ఉండాలని అన్నారు.ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి, యువ న్యాయవాది పరిటాల సంతోష్ కుమార్ తాను చదువుకున్న పాఠశాలపై ఉన్న అభిమానంతో తన గురువులందరినీ ఘనంగా సన్మానించారు. తనకు విద్యాబుద్ధులు నేర్పి న్యాయవాదిగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. తనలాగే ఈ పాఠశాల నుంచి ఎంతో మంది విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు జాన్ మణి, గుణిరామ్, కృష్ణయ్య, వరలక్ష్మి, సుభద్ర, వినోద్ కృష్ణ, వెంకటేష్, శ్రీనివాసరావు, రంజిత్ కుమార్, సమీన్, తులసిరాం తదితరులు పాల్గొన్నారు.



# భావితరాలకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు

- విద్యతోనే బంగారు భవిష్యత్తు
- జాతి నిర్మాణానికి ఉపాధ్యాయులు పునరంకితం కావాలి: ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
- మండలంలోని 30 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గంలోని అన్నపురెడ్డిపల్లి మండలంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కార్యక్రమం వైభవంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన మండలంలోని 30 మంది ఉపాధ్యాయులను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శాలువాలు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి వారిని గౌరవించడం పట్ల కార్యక్రమానికి హాజరైన పలువురు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకురాగల శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణను నేర్పి భావితరాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత ముఖ్యమని, అందుకోసం ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, వాటర్ ప్యూరిఫైయర్లు, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడలు తదితర అవసరాలను గుర్తించి వాటి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి వారు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.అశ్వారావుపేట నియోజకవర్గంలో విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసి, జిల్లా స్థాయిలో మంచి స్థాయికి తీసుకెళ్లాలన్నదే తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు తన వంతు సహాయం అందిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే విద్యార్థులకు మరింత మెరుగైన భవిష్యత్తును అందించవచ్చని అన్నారు.మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనంద్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి డి రాజేశ్వరి, అన్నపురెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ లకావత్ లక్ష్మి, ఉపసర్పంచ్ మారగాని అశోక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంగోతు వెంకటేశ్వర్లు, మండల ప్రజాప్రతినిధులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మండలంలోని ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు శివ హత్య కేసులో తుది ఘట్టం

- పరారీలో ఉన్న నలుగురు కీలక నిందితులు అరెస్ట్
- సంచలనం రేపిన శివ హత్య కేసులో 27మంది నిందితుల అరెస్ట్ పూర్తి
- శివ హత్య కేసులో పోలీసులకు భారీ విజయం
- ఎట్టకేలకు ముగిసిన గాలింపు, నలుగురు నిందితులకు సంకెళ్లు



**మణుగూరు, సెప్టెంబర్ 05 (ప్రజా జ్యోతి) :** మణుగూరులో కొద్దీ రోజుల క్రితం ఎం.కె గ్యాంగ్ చేతిలో శివ దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. నిందితులను వెంటనే పట్టుకోవాలని ప్రజలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. దీంతో శివ హత్య కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితులను పట్టుకున్నారు. ఈ కేసులో మొత్తం 27 మంది నిందితులను గుర్తించగా, అందులో 23 మందిని ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. అయితే ఆనాటి నుండి పరారీలో ఉన్న మరో నలుగురు కీలక నిందితుల కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. తాజాగా పరారీలో ఉన్న నలుగురు నిందితులను శనివారం అదుపులోకి తీసుకున్నట్లు మణుగూరు సీఐ పాటి నాగబాబు ఓ ప్రకటనలో తెలియజేశారు. అయితే అరెస్ట్ అయిన వారిలో 1.శివరాత్రి సాంబశివరావు, 2.పూణెం నాగేంద్రబాబు, 3. చాతబోలు ఏసు, 4. వల్లపు మల్లికార్జున ఉన్నారని తెలిపారు. వీరి అరెస్ట్ తో ఈ కేసులో మొత్తం 27 మంది నిందితులను అరెస్ట్ చేయడం పూర్తయినట్లు సీఐ తెలిపారు.

## ముగిసిన టీచర్స్ వీక్

- శ్రీ సరస్వతి విద్యానికేతన్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**చర్ల, సెప్టెంబర్ 05: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని తేగడ గ్రామంలోని శ్రీ సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు నిర్వహించిన 'టీచర్స్ వీక్' వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం వినూత్న కార్యక్రమాలతో వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించారు.పాఠశాల వారపు కార్యక్రమం 'ఎస్ఎస్‌వీఎన్ సంస్కార్'లో భాగంగా వారం రోజుల పాటు ఉదయం ప్రార్థనా సమయంలో గురువుల ప్రాముఖ్యత, సమాజంలో వారి పాత్రను విద్యార్థులు వివరించారు. ఏర్పాటు చేసిన గ్రాటిట్యూడ్ వాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు తమకు ఇష్టమైన ఉపాధ్యాయులపై ప్రేమాభిమానాలను వ్యక్తం చేస్తూ స్వహస్తాలతో రాసిన కృతజ్ఞతా కార్డులు, సందేశాలను గోడపై ప్రదర్శించారు. విద్యార్థుల గురుభక్తిని చూసి ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో పాఠశాలకు వచ్చి అలరించారు. అనంతరం వారే ఉపాధ్యాయులుగా మారి తరగతులను నిర్వహించడం విశేషంగా ఆకట్టుకుంది. ఆటపాటలతో విద్యార్థులు సందడి చేశారు. ఉపాధ్యాయుల కోసం పాఠశాల యాజమాన్యం సరదా ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసింది. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ లిఖిత మాట్లాడుతూ అజ్ఞానమనే చీకట్లను తొలగించి విజ్ఞానమనే కాంతి వైపు నడిపించేది గురువు మాత్రమేనని అన్నారు. భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం కల్పించారని విద్యార్థులు ఎంతటి ఉన్నత స్థాయికి ఎదిగినా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఎప్పటికీ గుర్తుంచుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణతో కూడిన విద్యను పెంపొందిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఉపాధ్యాయ బృందానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.ఈ వేడుకలు తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చాయని ఉపాధ్యాయులు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు స్వయంగా రాసిన కృతజ్ఞతా కార్డులు తమను భావోద్వేగానికి గురిచేశాయని తమ శ్రమకు దక్కిన నిజమైన గౌరవం ఇదేనని అన్నారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ, ఉపాధ్యాయులు రమేష్, శ్రీదేవి, ప్రమీల, శ్రావణి, పూజ, శైలజ, రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.



## అన్నుల్ అవిజిత్ కుబంజారా సంఘాల జేఏసీ వినతి

- ఏజెన్సీలో జీఓ నెంబర్ 3 ను పునఃరుద్ధరించాలి



**కొత్తగూడెం కలెక్టరేట్ , సెప్టెంబర్ 5 , (ప్రజాజ్యోతి )** పాల్వంచ బస్టాండ్ సెంటర్లో శుక్రవారం రాత్రి బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి పాల్వంచకు విచ్చేసిన బాబు జగ్జీవన్ రామ్ మనవడు ,మాజీ లోక్సభ స్పీకర్ మీనా కుమారి కుమారుడు, ఎఐసిసి అధికార ప్రతినిధి అన్షుల్ అవిజిత్ ను బంజారా సంఘాల జేఏసీ నాయకులు జీవో నెంబర్ 3 ను పునరుద్ధరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వీరు నాయక్, జేఏసీ గౌరవ అధ్యక్షులు రమేష్ రాథోడ్ లు మాట్లాడుతూ గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో రద్దు చేయబడిన జిఓ నెం. 3 ని వెంటనే పునఃరుద్ధరించాల నీ, గిరిజనుల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలనీ, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి కోసం తక్షణ చర్యలు తీసుకోవాలినీ , సుప్రీం కోర్టు రద్దు చేసిన జిఓ నెంబర్ పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఏజెన్సీ హక్కులు కాపాడుతానని దానికోసం చర్యలు చేపట్టడం అందరికీ తెలిసిందే, కావునా కేంద్రంలో ప్రతిపక్షంలో ఉన్నా రాహుల్ గాంధీ, మల్లి ఖార్జున్ ఖర్గే పార్లమెంట్ లో మాట్లాడి గిరిజన హక్కులు కాపాడాలని అ విధంగా చర్యలు చేపట్టేలా కేంద్రం లో ప్రతి పక్షము, ఈ రాష్ట్రము లో అధికారం లో ఉన్నా ప్రభుత్వం దృష్టి కు తీసుకోని వెళ్లాలని రమేష్ రాథోడ్ అన్షుల్ అవిజిత్ కు అందజేసిన వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు జీవో : 3 రద్దు వల్ల గిరిజన యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని, దీనిని పునఃరుద్ధరిం వరకు తమ పోరాటం ఆగదని తెలిపారు. ఇందుకు స్పందించినఅన్షుల్ అవిజిత ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు ,ఈ కార్యక్రమం లో దారావత్ కాన్షిరాం, బానోత్ భరత్ గుగులోత్ కుశ నాయక్ తదితరులు పాల్గోన్నారు

## విద్యార్థులే గురువులుగా

- గురుదేవ్ విద్యాలయంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**చర్ల, సెప్టెంబర్ 05: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని గురుదేవ్ విద్యాలయంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రీ ప్రైమరీ నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించి తమ గౌరవం, కృతజ్ఞతలను చాటుకున్నారు.ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో 'స్వీయ బోధనా దినోత్సవం' నిర్వహించారు. ఇందులో 186 మంది విద్యార్థులు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, ఆయాలు, కార్యాలయ సిబ్బంది తదితరులుగా వివిధ బాధ్యతలు స్వీకరించారు. విద్యార్థులు తరగతి గదుల్లో పాఠాలు బోధించడంతో పాటు పాఠశాల నిర్వహణలోని వివిధ విధులను క్రమశిక్షణతో నిర్వహించారు.ఒక పాఠశాల సక్రమంగా నడవడంలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, సమయపాలన, క్రమశిక్షణ, పరస్పర సహకారం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పాఠశాల యాజమాన్యం తెలిపింది.ఈ సందర్భంగా అకడమిక్ సమన్వయకర్తలు ఎం.వి. సుబ్రహ్మణ్యం, జి. శ్రీనివాస్ ఉపాధ్యాయుల ప్రాముఖ్యత, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్రపై సందేశం అందించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, మారుతున్న విద్యా విధానాలు, సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తమను తాము నవీకరించుకోవాలని సూచించారు.విద్యార్థులు కూడా ఉపాధ్యాయుల గొప్పతనాన్ని, తమ జీవితాల్లో గురువుల పాత్రను వివరిస్తూ ప్రసంగించారు. ఒకరోజు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించడం ద్వారా బోధనతో పాటు విద్యార్థులను అర్థం చేసుకోవడం, మార్గనిర్దేశం చేయడం, ప్రోత్సహించడం వంటి బాధ్యతలను అనుభవపూర్వకంగా తెలుసుకున్నామని తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, విద్యార్థుల అభ్యున్నతికి వారు చేస్తున్న కృషి, అంకితభావాన్ని అభినందించారు. "గురువు మారితే విద్య మారుతుంది.. విద్య మారితే విద్యార్థి మారుతాడు.. విద్యార్థి మారితే ఒక తరం మారుతుంది" అనే స్ఫూర్తిదాయక సందేశంతో కార్యక్రమం ముగిసింది.



- మణుగూరులో రక్తపుటేరులు..!
- మరో ఉత్తరప్రదేశ్ గా మారానున్న మణుగూరు.?
- ఎం.కె.గ్యాంగ్ హత్య మరువకముందే మళ్లీ పోలీస్ స్టేషన్ సాక్షిగా బాహాబాహీ - భయంలో మణుగూరు ప్రజలు..!
- మణుగూరులో శాంతిభద్రతలు పూర్తిగా విఫలం...
- వరుస ఘర్షణలతో ప్రజల్లో వణుకు..!
- ప్రజాజ్యోతి ప్రతినిధిపై ఎస్సై అరాచకం - ప్రతినిధి ఫోన్ గుంజుకొని ఫోటోలు ఎందుకు తీశావ్ అంటు డిలీట్ చేయాలని బెదిరింపు.!
- వార్త కథనం కోసం ఫోటోలు తీస్తే నేరమా.?
- మణుగూరులో పత్రికా స్వేచ్ఛపై పోలీస్ దాడి.!
- పోలీసులు ఉన్నారా? లేరా? అని స్థానికుల ప్రశ్న.!
- ఒక వైపు హత్య..మరో వైపు ఘర్షణ..ఇంకో వైపు విలేకరిపై బెదిరింపు...
- విధుల్లో మణుగూరు పోలీస్ పూర్తిగా ఫెయిల్యూర్..!
- జిల్లా ఎస్పీ జోక్యం చేసుకోవాలని కోరుతున్న మణుగూరు ప్రజలు..!



# మణుగూరులో..... రక్తపుటేరులు..!

భద్రాద్రి కొత్తగూడెం క్రైమ్ ప్రతినిధి/ మణుగూరు (ప్రజాజ్యోతి)

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. నిన్న మొన్నటి వరకు ప్రశాంతంగా ఉండే మణుగూరు పట్టణం ఇప్పుడు నేరాలకు, గ్యాంగ్ వార్ లకు అడ్డాగా మారింది. కొద్ది రోజుల క్రితమే ఎంకె గ్యాంగ్ చేతిలో శివ అనే యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన మరువకముందే, నడిరోడ్డుపై మరోసారి యువకులు రక్తం వచ్చేలా కొట్టుకోవడం కలకలం రేపుతోంది. అందరు చూస్తూ ఉండగానే ఓ ఆటో డ్రైవర్, మ్యాజిక్ ట్రాలీ డ్రైవర్ నడిరోడ్డుపై బాహిబాహిగా కొట్టుకొని రక్తపుటేరులు పారిస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని...? ప్రజలు విమర్శలు కురిపిస్తున్నారు.**

ఒకప్పుడు ప్రశాంతతకు, కార్మికుల కష్టానికి, ఆప్యాయతకు నిలయంగా ఉండే మణుగూరు పట్టణంలో ఇప్పుడు యువకుల ఆగడాలతో అలజడి మొదలైంది. సోషల్ మీడియా రీల్స్, సినిమాల ప్రభావం, విచ్చలవిడి స్వేచ్ఛతో యువత దారి తప్పుతున్న తీరు తల్లిదండ్రులను, ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. మద్యం, గంజాయి మత్తులో గ్యాంగులుగా ఏర్పడి, తామే పెద్ద రౌడీలమన్న భ్రమలో అమాయకులపై దాడులకు పాల్పడటం ఇప్పుడు మణుగూరులో ఫ్యాషన్ గా మారింది. శుక్రవారం రాత్రి అంబేద్కర్ కూడలిలో పోలీస్ స్టేషన్ కూతవేట దూరంలో ముగ్గురు యువకులు నడి రోడ్డుపై విచక్షణ రహితంగా అందరు చూస్తుండగా, ట్రాఫిక్ ను సైతం స్థంబింపజేసి దాడికి పాల్పడిన ఆ సమయంలో స్టేషన్ నుంచి పోలీసులేవరు రాకపోవడం గమనార్హం. అది మరువకముందే శనివారం స్టేట్ బ్యాంక్ సమీపంలో ఆటో డ్రైవర్ మరో వ్యక్తి పై దాడి చేశాడు.ఇరువురు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని చెదరగొట్టి పంపివ్వడం జరిగింది.పోలీసుల అలసత్వం వల్లే గొడవలు, అల్లర్లు, హత్య, రౌడీ గ్రూప్ లు ఏర్పడుతున్నాయని స్థానిక ప్రజానీకం వాపోతున్నారు.

### మరో ఉత్తరప్రదేశ్ గా మారానున్న మణుగూరు...?

పట్టణంలో గస్తీ లేదు, అల్లర్లు చేసే యువకులపై నిఘా లేదు, గొడవలు అదుపు చేయడం అంతకన్నా లేదని స్థానికుల చర్చ అంబేద్కర్ సాక్షిగా చర్చనీయంశంగా మారింది. రాను రాను మణుగూరులో ఇదే పరిస్థితి కొనసాగితే ప్రశాంతంగా ఉన్న మణుగూరు మరో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంగా మారడం ఖాయమని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అంతేగాక మణుగూరులో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పయానే విమర్శలు జోరుగా వ్యక్తమవుతున్నాయి. యువత మాదకద్రవ్యాలకు, గ్యాంగ్ కల్చర్ కు అలవాటుపడి ఇలా అదుపు తప్పుతున్నారా? అనే చర్చ జరుగుతోంది. పట్టణంలో పోలీసులు సరైన గస్తీ, నిఘా ఏర్పాటు చేయకపోవడంతోనే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని స్థానిక మేధావులు చర్చించుకుంటున్నారు.ఏ ప్రభుత్వంలో లేని హత్యలు, గొడవలు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మణుగూరు పట్టణంలో రౌడీయిజం, మాదకద్రవ్యాలకు, గ్యాంగ్ కల్చర్ కు మారిందని మేధావులు చర్చుకుంటున్నారు.

### ఫోటోలు ఎందుకు తీశావ్ అని ప్రజాజ్యోతి క్రైమ్ ప్రతినిధిపై ఓ ఎస్సై దౌర్జన్యం...

పోలీసులు చేయాల్సింది నేరాన్ని అదుపు చేయడం, కానీ మణుగూరు పట్టణంలో సీన్ రివర్స్ అయింది. నడిరోడ్డుపై జరిగిన ఘర్షణను తన విధి నిర్వహణలో భాగంగా ఫోటోలు తీస్తున్న ప్రజాజ్యోతి క్రైమ్ ప్రతినిధి పై ఓ ఎస్సై దౌర్జన్యానికి దిగడం ఇప్పుడు పెద్ద వివాదంగా మారింది. పోలీస్ స్టేషన్ సాక్షిగా ప్రతినిధి చేతిలో ఉన్న ఫోన్ ను బలవంతంగా గుంజుకొని, "ఫోటోలు ఎందుకు తీశావ్" అంటూ ఫోన్లో ఉన్న ఫోటోలను డిలీట్ చేశారు. కర్తవ్యంలో భాగంగా ఫోటోలు తీసిన సదరు పాత్రికేయున్ని బెదిరించడం ఏంటని జర్నలిస్ట్ సంఘాలు మండిపడుతున్నాయి. ఇది పత్రికా స్వేచ్ఛపై నేరుగా దాడి చేయడమేనని వాపోతున్నారు.బొంబాయి హైకోర్టు పోలీస్ స్టేషన్ నిషిద్ధ ప్రదేశం కాదని, ఫోటోలు తీయొచ్చని స్పష్టంగా చెప్పినా, ఎస్సై ఇలా ప్రవర్తించడం చట్టాన్ని ఉల్లంఘించడమే తెలుస్తోంది. గ్యాంగ్ లను అదుపు చేయాల్సిన పోలీసులు, గ్యాంగ్ స్టర్లకు వత్తాసు పలుకుతున్నారా అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. దీన్ని కప్పిపుచ్చుకోవడానికే పోలీసులు వార్తలు రాసే విలేకరులపై పగబట్టడం మణుగూరు పోలీసింగ్ తీరుకు అద్దం పడుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు.

### జిల్లా ఎస్పీ జోక్యం చేసుకుంటారా..! లేక మణుగూరు పోలీస్ వింగ్ ను మారుస్తారా..?

మొత్తంగా మణుగూరులో పరిస్థితి చేయి దాటిపోయింది. మొన్న హత్య, నిన్న నడిరోడ్డు పై ఘర్షణ ఆపై దాడి దీంతో శాంతిభద్రతలు పూర్తిగా ప్రశ్నార్ధకంగా మారాయి. ఇకనైనా జిల్లా ఎస్పీ స్వయంగా జోక్యం చేసుకొని శాంతిభద్రతలను పటిష్టంగా అములు చేస్తారా..? లేక మణుగూరు పోలీస్ వింగ్ ను పూర్తిగా మారుస్తారా అనేది చర్చనీయంశంగా మారింది. మణుగూరులో రోజురోజుకూ పెరుగుతున్న గ్యాంగ్ కల్చర్ పై ఉక్కు పాదం మోపి, రౌడీషీటర్లపై నిఘా పెట్టాలని మండల ప్రజలు, మేధావులు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా విధి నిర్వహణలో ఉన్న ప్రజాజ్యోతి ప్రతినిధిపై దౌర్జన్యం చేసి, ఫోన్ గుంజుకున్న ఎస్సై పై తక్షణమే విచారణ జరిపి శాఖాపేరమైన చర్యలు తీసుకోవాలని జర్నలిస్ట్ సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ప్రశాంతమైన మణుగూరు కాస్తా నేరాలకు నిలయమైన మరో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంగా మారడం ఖాయమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





## ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం



**చర్ల, సెప్టెంబర్ 05: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని ఉప్పరగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం ఓటు హక్కు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఓటు హక్కు ఉన్నవారు ఓటరు జాబితాలో తమ వివరాల్లో తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలని అవగాహన కల్పించారు.ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సింగసముద్రం, ఉప్పరగూడెం అంగన్ వాడీ పాఠశాలల విద్యార్థులకు పలకలు, బలపాలు పంపిణీ చేశారు. అలాగే ఉప్పరగూడెం గ్రామపంచాయతీకి మంజూరైన విద్యుత్ స్తంభాలు చేరుకోవడంతో సింగసముద్రం గ్రామంలో వాటిని ఏర్పాటు చేసే పనులు ప్రారంభించారు. సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది, మిషన్ భగీరథ వాటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదివాసీ నాయకుడు పాయం దుర్గారావు మృతి బాధాకరం

- బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటుంది
- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



**దమ్మపేట, సెప్టెంబర్ 05, (ప్రజాజ్యోతి ):** అశ్వారావుపేట మండలానికి చెందిన ప్రముఖ ఆదివాసీ నాయకుడు పాయం దుర్గారావు ఖమ్మం రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న ఎమ్మెల్యే వెంటనే దుర్గారావు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి శవ పంచనామా ప్రక్రియను దగ్గరుండి పూర్తి చేయించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాయం దుర్గారావు మృతి ఆదివాసీ సమాజానికి తీరని లోటని అన్నారు. ప్రజల కోసం ఆయన చేసిన సేవలు, ఆదివాసీల అభ్యున్నతికి అందించిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. దుర్గారావు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఈ విషాద సమయంలో బాధిత కు టుంబ సభ్యులకు కాంగ్రెస్ , రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటాయ ని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. దుర్గారావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# అంతా లీకేజీల మయం..!

- మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలతో అవస్థలు
- ఎక్కడపడితే అక్కడ లీక్ అవుతున్న పైపులు
- ప్రతి రోజు రిపేర్లు చేయాల్సిన పరిస్థితి
- 15 రోజుల్లో సుమారు 10 ప్రాంతాల్లో లీకేజీలు
- పకడ్బందీగా చేస్తున్నారా.. మొక్కుబడిగా చేస్తున్నారా?
- ప్రధాన రోడ్ల వెంబడి ఇదే పరిస్థితి
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు, వ్యాపారులు
- పూర్తిస్థాయిలో లీకేజీలు సరిచేయాలని డిమాండ్
- ఉన్నతాధికారులు జర దృష్టి సారించరూ..!





**ఇల్లందు, సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి)** మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన పైప్‌లైన్ వ్యవస్థ తరచూ లీకేజీలకు గురవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇల్లందు పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు పలు ప్రాంతాల్లో పైప్‌లైన్లు లీక్ అవుతూ రోడ్లపైకి నీరు చేరుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో ఒకవైపు తాగు నీరు వృథా అవుతుండగా.. మరోవైపు రోడ్లు దెబ్బతిని ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

**ఎక్కడపడితే అక్కడ లీకేజీలు**

పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్లు తరచూ లీక్ అవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పైపులు లీక్ అయిన ప్రతిసారీ సంబంధిత సిబ్బంది మరమ్మతులు చేపడుతున్నప్పటికీ కొద్దిరోజులకే మళ్లీ అదే ప్రాంతంలో లేదా మరో ప్రాంతంలో లీకేజీ ఏర్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పైప్‌లైన్ పనుల నాణ్యతపై ప్రజల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**15 రోజుల్లోనే పది ప్రాంతాల్లో..**

గత 15 రోజుల వ్యవధిలో పట్టణంలోని సుమారు పది ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలు చోటుచేసుకున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఆమ్ బజార్, మెయిన్ రోడ్డు వెంబడి బుగ్గవాగు, రైల్వే బ్రిడ్జి, కొత్తబస్టాండ్ వద్ద పలు ప్రాంతాల్లో, గోవింద్ సెంటర్, కోర్టు సమీపంలో వరుసగా లీకేజీలు ఏర్పడుతుండటంతో సిబ్బందికి కూడా ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో రిపేర్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. అంతే కాకుండా రిపేర్లు చేసిన అనంతరం గుంతలను సక్రమంగా కూర్చోకపోవడంతో నృత్యం పదుల సంఖ్యలో తిరిగే భారీ వాహనాలు ఆ గుంతలో ఇరుక్కుపోతున్నాయి. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రధాన రోడ్ల వెంబడి ఇదే పరిస్థితి**

పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి కూడా పైప్‌లైన్ లీకేజీలు కనిపిస్తుండటంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. లీకైన నీరు రోడ్లపై ప్రవహించడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కన ఉన్న దుకాణాల వద్దకు నీరు చేరడంతో వ్యాపారులు కూడా అవస్థలు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

**తాగునీరు వృథా.. ప్రజలకు ఇబ్బందులు**

ప్రజలకు తాగునీటిని అందించేందుకు ఉద్దేశించిన మిషన్ భగీరథ నీరు పైప్‌లైన్ లీకేజీల కారణంగా రోడ్లపై వృథాగా పారిపోతుండటంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ప్రతి చుక్క విలువైనదని, ఇలా నీరు వృథా కావడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు అంటున్నారు.

**పకడ్బందీగా చేస్తున్నారా.. మొక్కుబడిగా చేస్తున్నారా?**

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలకు పదే పదే మరమ్మతులు చేస్తున్నా సమస్య పూర్తిగా పరిష్కారం కాకపోవడంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రిపేర్లు పకడ్బందీగా చేస్తున్నారా.. లేక మొక్కుబడిగా పనులు ముగిస్తున్నారా? అన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. లీకైన ప్రాంతాల్లో కేవలం పైపులకు ప్యాచ్‌వర్క్ చేయడం కాకుండా సమస్యకు మూలకారణాన్ని గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

**రిపేర్లతో రోడ్ల పరిస్థితి మరింత అధ్వానం**

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలను సరిచేసేందుకు రోడ్లను తవ్వి మరమ్మతులు చేపడుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే పనులు పూర్తయిన అనంతరం రోడ్లను పూర్తిస్థాయిలో పునరుద్ధరించకపోవడంతో రహదారుల పరిస్థితి మరింత అధ్వానంగా మారుతుందని స్థానికులు చెబుతున్నారు. వరుసగా తవ్వకాలు, రిపేర్ల కారణంగా రోడ్లపై ప్రయాణం కష్టంగా మారుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజలు, వ్యాపారులకు తప్పని తిప్పలు**

ప్రధాన రహదారుల వెంట ఉన్న వ్యాపార సముదాయాల వద్ద పైప్‌లైన్ లీకేజీల కారణంగా నీరు నిలిచిపోవడంతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాల ముందు నీరు చేరడంతో వినియోగదారులు రావడానికి ఇబ్బంది పడుతున్నారని, వ్యాపార కార్యకలాపాలపై కూడా ప్రభావం పడుతుందని పేర్కొంటున్నారు. సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించాలని కోరుతున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**

మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు, నిర్వహణపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. ఒకే ప్రాంతంలో పదేపదే లీకేజీలు ఏర్పడుతున్నా కారణాలను గుర్తించి చర్యలు తీసుకోకపోవడంపై ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పైప్‌లైన్ నిర్మాణం, జాయింట్లు, కనెక్షన్లు తదితర అంశాలను నిపుణులతో పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. తాత్కాలికంగా లీకేజీలను అరికట్టడం కాకుండా పట్టణంలో ఎక్కడెక్కడ పైప్‌లైన్ సమస్యలు ఉన్నాయో సమగ్రంగా గుర్తించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తరచూ లీకేజీలు ఏర్పడుతున్న ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాలని కోరుతున్నారు.

**ఉన్నతాధికారులు దృష్టి సారించరూ..!**

పట్టణంలో వరుసగా చోటుచేసుకుంటున్న మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. గత 15 రోజుల్లోనే సుమారుగా పది ప్రాంతాల్లో లీకేజీలు ఏర్పడుతున్న నేపథ్యంలో సమస్య తీవ్రతను గుర్తించి సమగ్ర చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, తాగునీరు వృథా కాకుండా పైప్‌లైన్ వ్యవస్థను పటిష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# బలహీన వర్గాల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించిన మహోన్నత నేత జగ్జీవన్ రామ్

- డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల
- జగ్జీవన్ రామ్ మనుమడు, ఎఐసిసి అధికార ప్రతినిధి అవిజిత్ ను ఘనంగా సన్మానించిన కొత్వాల -కాంగ్రెస్ శ్రేణులు



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 5, (ప్రజాజ్యోతి )** పేద, బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించిన మహోన్నత నేత జగ్జీవన్ రామ్ అని డిసిఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. భారత మాజీ ఉపప్రధాని, దివంగత డాక్టర్ బాబు జగ్జీవన్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని పాల్వంచ బి.సి.ఎం.రోడ్డులో దండోరా శ్రీను ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేశారు. ఆయన విగ్రహావిష్కరణను ఆయన మనుమడు, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమారి కుమారుడు, నేషనల్ కాంగ్రెస్ (ఎఐసిసి) అధికార ప్రతినిధి డాక్టర్ అన్షుల్ అవిజిత్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఉప ముఖ్యమంత్రి టి.రాజయ్య, మానుకొండూరు శాసనసభ్యులు, టిపిసిసి ఎస్సి సెల్ రాష్ట్ర చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొత్వాల మాట్లాడుతూ నిత్యం అణగారిన వర్గాల సమస్యల పరిష్కారానికై కృషి చేసిన నేత జగ్జీవన్ రామ్ అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతీ భారతీయుడు పేద ప్రజల సంక్షేమానికి కృషి చేయాలని కొత్వాల అన్నారు. అనంతరం కొత్వాల ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు అన్షుల్ అవిజిత్తును శాలువాతో ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కాల్వ భాస్కర్ రావు, బానోత్ బాలు నాయక్, కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, మహిపతి రామలింగం, వై.వెంకటేశ్వర్లు, కొండం వెంకన్న గౌడ్, ధర్మసోత్ ఉపేందర్, షేక్ గద్దర్ బాషా, కొండూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# చంద్రబాబుపై విమర్శలు చేస్తే సహించేది లేదు

- **జగదీశ్‌రెడ్డిపై టీడీపీ అశ్వారావు పేట నియోజకవర్గ ఇన్‌చార్జి కట్రం స్వామిదొర ఆగ్రహం**




**దమ్మపేట, సెప్టెంబర్ 05,(ప్రజాజ్యోతి):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఏపీ ప్రభుత్వంపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను అశ్వారావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కట్రం స్వామిదొర తీవ్రంగా ఖండించారు. శుక్రవారం దమ్మపేటలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా కట్రం స్వామిదొర మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీపై, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అనవసర విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ముందుగా బీఆర్ఎస్ పార్టీ అంతర్గత పరిస్థితులను, తమ నాయకుడి వ్యవహారాలను చూసుకోవాలని జగదీశ్‌రెడ్డికి సూచించారు. ఫామ్‌హౌస్‌కే పరిమితమై అసెంబ్లీకి రాని మీ నాయకుడి గురించి ముందుగా మాట్లాడాలని అన్నారు.రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి 12 సీట్లు కూడా రావని టీడీపీ నాయకులు జోస్యం చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ పరిస్థితిని ఆ పార్టీ నాయకులు గుర్తుంచుకోవాలని సూచించారు. చంద్రబాబు నాయుడిపై, తెలుగుదేశం పార్టీపై విమర్శలు చేసే ముందు తమ పార్టీ పరిస్థితిని సమీక్షించుకోవాలని హితవు పలికారు.ఈ సమావేశంలో ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు ఎం.డి. వలీపాషా, తేళ్ల చెన్నయ్య, నార్లపాటి శ్రీనివాసరావు, పానుగంటి రామారావు, వారధి సత్యనారాయణ, సొసైటీ వైస్ చైర్మన్ కట్రం ఎర్రప్ప, టీడీపీ సీనియర్ నాయకులు గడ్డిపాటి సత్యం, తెల్లం రామారావు, కణితి లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సలెంట్ భాషా హైస్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం




**పినపాక,సెప్టెంబర్ 05(ప్రజాజ్యోతి )**పినపాక మండలం బయ్యారం క్రాస్‌రోడ్ లోని ఎక్సలెంట్ భాషా హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ముఖ్య అతిథి ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ ఎండీ యూసఫ్ షరీఫ్ మాట్లాడుతూ గురువులే విద్యార్థుల విజయానికి బాటలు వేస్తారన్నారు.అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డైరెక్టర్లు ఎండీ యాకూబ్ షరీఫ్, ముక్కు నర్సారెడ్డి, బం డారు నరేంద్ర, ప్రిన్సిపల్ అంకం సురేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## బీర్ బాటిల్ ఐఈడీ నిర్వీర్యం



**చర్ల , సెప్టెంబర్ 05: (ప్రజా జ్యోతి ):**గ్రామస్థుల సమయస్ఫూర్తి భద్రతా దళాల సత్వర చర్యలతో మావోయిస్టులు అమర్చిన పాత ప్రెషర్ ఐఈడీని సురక్షితంగా నిర్వీర్యం చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా మద్దె పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.బందేపారా, పెగడపల్లి గ్రామాలకు చెందిన కొందరు గ్రామస్థులు అడవిలో పుట్టగొడుగులు సేకరించేందుకు వెళ్లగా నేలపై అనుమానాస్పదంగా కనిపించిన ఓ తీగను గుర్తించారు. అది భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబు అయి ఉండవచ్చని అనుమానించిన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే మద్దె పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బందితో కూడిన సంయుక్త బృందం సంఘటనా స్థలానికి చేరుకుంది. అనంతరం బాంబు నిర్వీర్య బృందం సాంకేతిక నైపుణ్యంతో ప్రెషర్ బీర్ బాటిల్ ఐఈడీని సురక్షితంగా తొలగించి, అక్కడికక్కడే నిర్వీర్యం చేసింది.ఈ ఆపరేషన్‌లో మద్దె పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ సురేష్ జబ్బా, సీఆర్పీఎఫ్ 22వ బెటాలియన్ 'ఏ' కంపెనీ సంగంపల్లి నుంచి అసిస్టెంట్ కమాండెంట్ మనోజ్ కుమార్ నేతృత్వంలోని బీడీఎస్ బృందం పాల్గొంది.ఈ సందర్భంగా బీజాపూర్ పోలీసులు ప్రజలకు హెచ్చరిక జారీ చేశారు. అడవులు, లిబాటలు, పొలాలు, రహదారుల పక్కన అనుమానాస్పద తీగలు, గుంతలు, టిఫిన్ బాక్సులు, కంటైనర్లు లేదా గుర్తుతెలియని వస్తువులు కనిపిస్తే వాటిని తాకకుండా, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా భద్రతా శిబిరానికి సమాచారం అందించాలని కోరారు. ప్రజల అప్రమత్తత, సకాలంలో అందించే సమాచారం పెద్ద ప్రమాదాలను నివారించగలదని పోలీసులు తెలిపారు.

## 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రతిపక్షాల అసత్య ప్రచారం

- **రాష్ట్రంలో ప్రజా రంజక పాలన అందిస్తున్న ప్రజా ప్రభుత్వం**

**ఇల్లందు, సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి)**1000 రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలలో ఏమాత్రం వాస్తవం లేదని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శనివారం ఇల్లందు మార్కెట్ యార్డ్ లో 1000 రోజుల పాలన పూర్తయినందున ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల ఆశీర్వాదాలతో కొలువుతీరిన ప్రజా ప్రభుత్వంలో రంజక పాలన అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో పేదల కోసం చేసింది శూన్యమని, కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని విమర్శించారు. పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన గత పాలకులకు ఇప్పుడు విమర్శించే నైతిక అర్హత లేదన్నారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే రాష్ట్రంలో నిజమైన ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని తెలిపారు. మహిళల కోసం మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు సౌకర్యం కల్పించి ఆడబిడ్డలకు అండగా నిలిచిందని, అదేవిధంగా గృహజ్యోతి, యువ వికాసం, చేయూత వంటి ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తూ ప్రతి పేదవాడికి న్యాయం చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటుందని, రైతు భరోసా, రైతు బీమా కింద ఇప్పటికే రెండు విడతలుగా పెట్టుబడి సాయం అందించి రైతులను పెద్ద ఎత్తున ఆదుకుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన పేదలకు ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా నూతన రేషన్ కార్డులు, అలాగే కొత్త పెన్షన్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నియోజకవర్గ పరిధిలోనే పేదలకు 4,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఇళ్లు లేని నిరుపేదల కలను నిజం చేసిందని, గత ప్రభుత్వం ఈ నియోజకవర్గంలో పేదవాడికి ఏమీ చేయలేదని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలోని ప్రతి రైతు భూమికి సాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని, సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత ఎమ్మెల్యే సీతారామ ప్రాజెక్టుపై అబద్ధపు ప్రచారం చేస్తూ ప్రజలను, రైతులను మోసం చేశారని, సీతారామ ప్రాజెక్టు నీళ్లు తీసుకువచ్చి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చూస్తానని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలు వంటా వార్పు మాటలతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని, వాటిని ప్రజలు నమ్మవద్దని, ప్రభుత్వ పథకాలు గ్రామంలోని ప్రతి గడపకు తెలిసే విధంగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బోడా మంగీలాల్, ఐదు మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పట్టణ, మండల అధ్యక్షులు బోళ్ళ సూర్యం, మండల రాము, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## అడగకుండానే విద్యను వరంగా అందించేవాడే ఉపాధ్యాయుడు



**ఇల్లందు, సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి)** అడిగితే దేవుడు వరం ఇస్తాడు.. అడగంది అమ్మయినా అన్నం పెట్టదు.. కానీ అడగకుండానే విద్యార్థులకు విద్యాబుద్ధులను నేర్పిస్తూ వారి బంగారు బాటకు ఉపాధ్యాయుడు వరాలను ఇస్తున్నాడని మార్గదర్శిని పాఠశాల డైరెక్టర్లు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యాదగిరి రాంబాబు, ఆర్వపల్లి రాధాకృష్ణలు అన్నారు. శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్గదర్శిని గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఉపాధ్యాయులకు శాలువాలు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా విద్య బోధనలను చేశారు. నేటి సమాజంలో సాంకేతికత ఎంతో దూసుకుపోతుందని ఆ సాంకేతికత రూపొందేది గురువు మార్గ దర్శకత్వంలోనే సాధ్యమవుతుందని విషయాన్ని అందరూ గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులు తమ మేధాశక్తికి మరింత వదిలి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. విద్యార్థులు చెడు మార్గంలో పైనుంచి కుండా విద్యాలయాల్లో ఉపాధ్యాయులు, ఇంటి వద్ద తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం ఒక్కరోజు ఉత్తమ టీచర్లను ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా గురుపూజోత్సవం

- **దమ్మపేటలో ఆదర్శ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**



**దమ్మపేట,సెప్టెంబర్ 05,(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండల ఆదర్శ మండల సమాఖ్య ఆధ్వర్యంలో, మదర్ థెరిస్సా మండల దివ్యాంగుల మనోవికాస పునరావాస సేవల కేంద్రంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం (గురుపూజోత్సవం )ఘనంగా నిర్వహించారు. మండల సమాఖ్య ప్రతినిధులు, దివ్యాంగుల పిల్లలు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలాభిషేకం చేసి నివాళులర్పించారు.మండల సమాఖ్య ప్రతినిధులను దివ్యాంగుల పిల్లలు శాలువాలతో ఘనంగా సత్కరించారు.మండల ఏపీఎం, సిబ్బంది, ఎన్‌హెచ్‌సీ సీసీ, సీబీఆర్ వర్కర్లు, యాక్టివిస్టులు పా ల్గొన్నారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తుచేసుకుంటూ వారి పాత్రను కొనియాడారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**పినపాక,సెప్టెంబర్ 05(ప్రజాజ్యోతి)** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పినపాక మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈఓ కొమరం నాగయ్య ఆధ్వర్యంలో శనివారం రైతువేదికలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీఓ సంకీర్త్ పాల్గొని మాట్లాడుతూ కృతజ్ఞతకు మించిన గురుదక్షిణ లేదన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, జీవితానికి సార్థకతను, మంచి ప్రవర్తనను అందించేది గురువేనన్నారు. ఎంఈఓ కొమరం నాగయ్య మాట్లాడుతూ నవసమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.మండలంలోని జెడ్పీహెచ్ఎస్, మినీ గురుకులం, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలలకు చెందిన సీనియర్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఎస్జీటీలు, సీఆర్పీలు, సీఆర్డీలతో కలిపి 22 మందిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి ,డి.రామిరెడ్డి, రాంగోపాల్, బాబూరావు, ముత్తయ్య, సీతారాములు, పీడీ వీరన్న, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## వ్యవసాయ అనుబంధ రంగాలతో అదనపు ఆదాయం పొందాలి

- రైతులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ



**పాల్వంచ, సెప్టెంబర్ 5,ప్రజాజ్యోతి:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం, పాల్వంచ క్లస్టర్ పరిధిలోని కొత్తూరు గ్రామం పేటచెరువు వద్ద ఆత్మ (వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ) ఆధ్వర్యంలో "వ్యవసాయంలో విభిన్న ఉపాధి అవకాశాలు" అనే అంశంపై నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.వ్యవసాయ విస్తరణ అధికారి జి. నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబురావు, మండల వ్యవసాయ అధికారి పి. శంభోశంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలపై అవగాహన కల్పించారు.అలాగే వివిధ రంగాలకు చెందిన నిపుణులు రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు, వ్యవసాయంతో పాటు చేపట్టగల అనుబంధ కార్యకలాపాలపై సమగ్రంగా వివరించారు. రైతులు సాంప్రదాయ వ్యవసాయంతో పాటు విభిన్న ఉపాధి మార్గాలను ఎంచుకోవడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించారు.శిక్షణలో పాల్గొన్న రైతులకు మధ్యాహ్న భోజనంతో పాటు నోట్ పుస్తకాలు, కలాలను పంపిణీ చేశారు. అనంతరం శిక్షణ కార్యక్రమంపై రైతుల అభిప్రాయాలను సేకరించి, వారు శిక్షణలో నేర్చుకున్న అంశాలపై చిన్న పరీక్ష నిర్వహించారు. కొత్తూరు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆసక్తిగా శిక్షణ పొందారు.

## బాబు దత్తత పేరుతో దోపిడీ

- రూ.1.40 లక్షలు కాజేసిన దుండగులు
- ఆరుగురు నిందితుల అరెస్ట్

**ఇల్లందు, సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి )**నాలుగు నెలల పసిబిడ్డను దత్తతకు ఇస్తామని ఓ మహిళను నమ్మించి రూ.1.40 లక్షలు తీసుకుని మోసానికి పాల్పడిన ఘటన టేకులపల్లి మండలంలో కలకలం రేపింది. దత్తత పేరుతో డబ్బులు వసూలు చేసి బిడ్డను అప్పగించకుండా పరారైన ముఠా వ్యవహారాన్ని టేకులపల్లి పోలీసులు ఛేదించారు. కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి నగదు, వాహనాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఇల్లందు డిఎస్పి యు వెంకన్న బాబు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన గౌరీగారి ప్రమీల అనే మహిళకు నాలుగు నెలల బాబును దత్తతకు ఇస్తామని నిందితులు నమ్మబలికారు. ఈ క్రమంలో ఆమె నుంచి రూ.1. 40 లక్షలు తీసుకున్న అనంతరం బిడ్డను అప్పగించకుండా పరారయ్యారన్నారు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన ప్రమీల టేకులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదుపై టేకులపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో పోలీసులు నిందితుల కదలికలపై నిఘా పెట్టారన్నారు. దర్యాప్తులో లభించిన ఆధారాల ఆధారంగా నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 5న బొమ్మనపల్లి గ్రామ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అదే సమయంలో పోలీసులను చూసి కొందరు వ్యక్తులు భయాందోళనకు గురవుతున్న విషయాన్ని ఎస్సై తిరుపతి గమనించారని, అనుమానం వచ్చిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా దత్తత పేరుతో మోసానికి సంబంధించిన వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రూ.1.40 లక్షల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. దత్తత పేరుతో అమాయకులను నమ్మించి డబ్బులు వసూలు చేసే మోసాలకు ప్రజలు గురికావద్దని సూచించినట్లు సమాచారం. పిల్లల దత్తత విషయంలో మధ్యవర్తులను నమ్మకుండా, చట్టబద్ధమైన అధికారిక విధానాన్ని మాత్రమే అనుసరించాలని సూచించారు. సి బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.





# మేడారం జాతీయ సదస్సులను జయప్రదం చేయాలి

- సెప్టెంబర్ 9, 10న జరిగే సదస్సులకు భారీగా తరలిరావాలి
- ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కొలికపోగు కాంతారావు మాదిగ



**దమ్మపేట, సెప్టెంబర్ 05,(ప్రజా జ్యోతి):** వరంగల్ మేడారంలో సెప్టెంబర్ 9, 10 తేదీల్లో నిర్వహించనున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ జాతీయ సదస్సులను జయప్రదం చేయడానికి కార్యకర్తలు సిద్ధం కావాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, దమ్మపేట మండల ఇన్‌చార్జి కొలికపోగు కాంతారావు మాదిగ పిలుపునిచ్చారు. శనివారం దమ్మపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సదస్సులకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ డ్రెస్‌కోడ్, సమయపాలన, క్రమశిక్షణకు వందశాతం కట్టుబడి రావాలని సూచించారు. నిబంధనలను పాటించిన వారిని మాత్రమే సభా ప్రాంగణంలోకి అనుమతిస్తామని తెలిపారు. నూతన మండల కమిటీల నిర్మాణ ప్రక్రియను వందశాతం పూర్తి చేసి, అక్టోబర్ 7న అమరావతిలో నిర్వహించనున్న జాతీయ సదస్సును విజయవంతం చేయాలని కోరారు.ఎంఎస్ఎఫ్, ఎంఎంఎస్, ఎంఎంఎం, ఎంఈఎఫ్‌తో పాటు అన్ని అనుబంధ విభాగాల నూతన కమిటీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాది, దేశానికి దిక్సూచిగా నిలిచేలా ఉద్యమాలను నిర్మించాలని అన్నారు. ప్రజా పోరాటాలకు నాయకత్వం వహిస్తూ రాజకీయ చైతన్యంతో పీడిత వర్గాలను ఏకం చేయాలని సూచించారు.సామాజిక, ఆర్థిక, మతపరమైన వివక్ష, అణచివేతలు లేని నవసమాజ నిర్మాణం కోసం జరిగే పోరాటంలో ప్రతి ఒక్కరూ ముందుండాలని కాంతారావు మాదిగ పిలుపునిచ్చారు.

**దమ్మపేట మండల నూతన కమిటీ ఎన్నిక**

అనంతరం దమ్మపేట మండల ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కొలికపోగు క్రాంతికుమార్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా దాట్ల అశోక్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కౌలూరి నాగేశ్వరరావు, అధికార ప్రతినిధిగా కొలికపోగు వరప్రసాదరావు మాదిగ, సహాయ కార్యదర్శిగా సంఘసాని రాంబాబు, కార్యదర్శులుగా లంక రామకృష్ణ మాదిగ, శ్రీను మాదిగ, జంజునూరి ముత్యాలరావు, దార్ల సాయి మాదిగ, నారపోగు అరవింద్ మాదిగలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ముఖ్య సలహాదారులుగా ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు పుల్లారావు, వీరయ్య, ముసలయ్య, వెంకటరమణ తదితరులను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నాయకులు అభినందనలు తెలిపారు.

## ప్రీ-ప్రైమరీ పాఠశాలలో మండల ఎంఈఓకు ఘన సన్మానం

- విద్యాభివృద్ధికి ఎంఈఓ సేవలు అభినందనీయం



**పాల్వంచ, సెప్టెంబర్ 5, ప్రజాజ్యోతి:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం బసవతారక కాలనీ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రీ–ప్రైమరీ పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ )కు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బసవతారక కాలనీ సర్పంచ్ జరుపుల కాశమ్మ, ఉప సర్పంచ్ చల్ల భాగ్యమ్మ, వార్డు సభ్యురాలు వాణి విద్య, గ్రామ పెద్ద అంకిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరి సింగ్, ఉపాధ్యాయురాలు అలివేలు, ప్రీ–ప్రైమరీ ఉపాధ్యాయురాలు కృష్ణవేణి కలిసి ఎంఈఓను శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి ఎంఈఓ అందిస్తున్న సేవలను కొనియాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు పాఠశాలల అభివృద్ధికి అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఆయాలు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రీచైతన్య పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**పాల్వంచ, సెప్టెంబర్ 5, ప్రజాజ్యోతి:**పాల్వంచ పట్టణంలోని ఒడ్డుగూడెం శ్రీచైతన్య పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠశాల అసెంబ్లీని నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి మిర్యాల మాట్లాడుతూ.. "గురువంతే గుణమున మిన్న.. గురువుకి సాటి ఇక ఏముందన్నా" అంటూ గురువుల గొప్పతనాన్ని, సమాజంలో ఉపాధ్యాయుల విశిష్ట పాత్రను వివరించారు. అసమాన విద్యావేత్త, గొప్ప మేధావి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగానికి చేసిన సేవలను ఆమె కొనియాడారు.ఈ సందర్భంగా కొత్తగూడెం జోన్ ఏజీఎం వీరయ్య మాట్లాడుతూ.. గురువు అంటే కేవలం పాఠాలు బోధించే వ్యక్తి మాత్రమే కాదని, మనలోని అజ్ఞానమనే చీకట్లను తొలగించి జ్ఞానమనే వెలుగును ప్రసాదించే మహనీయుడని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు నేర్పిన నైతిక విలువలను జీవితంలో ఆచరిస్తూ సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగడమే వారికి అందించే అసలైన గురుదక్షిణ అని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రైమరీ ఇన్‌ఛార్జ్ మహమ్మద్ సిరాజ్ బేగం, పి.పి.టి ఇన్‌ఛార్జ్ బండారు గిరీష్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిశాయి.

## మాస్టర్ మైండ్స్ కిడ్స్ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

- విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారిన 'సెల్ఫ్ గవర్నమెంట్ డే'



**పాల్వంచ, సెప్టెంబర్ 5, ప్రజాజ్యోతి:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పాండురంగాపురంలోని మాస్టర్ మైండ్స్ కిడ్స్ స్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ప్రతి ఏడాది సెప్టెంబర్ 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ జి. రాజు ముఖ్య అతిథిగా హాజరై ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.విద్యార్థుల్లో ఉపాధ్యాయ వృత్తిపై గౌరవ భావాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో పాఠశాలలో 'సెల్ఫ్ గవర్నమెంట్ డే' నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులు చీరలు, పంచెలు ధరించి ఉపాధ్యాయుల వేషధారణలో సందడి చేశారు.అనంతరం పాఠశాలలో సేవలందిస్తున్న ఉపాధ్యాయులందరినీ ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు పూలు, గ్రీటింగ్ కార్డులు అందజేసి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ జి. రాజు మాట్లాడుతూ.. తల్లిదండ్రుల తర్వాత పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనని అన్నారు. మాస్టర్ మైండ్స్ స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి విద్యాబుద్ధులు నేర్పుతున్నారని, వారి సేవలు మరువలేనివని కొనియాడారు. ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ వంశీ, ఉపాధ్యాయులు కవిత, సమీరా, రాగమాల, గీత, పద్మ, లక్ష్మి , శ్రావణి, రేచల్, సుప్రియ, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆనందోత్సాహాల మధ్య ముగిసింది.



# కే టి పి ఎస్ యాష్ టెండర్‌ను వెంటనే పునఃపరిశీలించాలి

- స్థానిక కాంట్రాక్టర్ల ఉపాధిని హరిస్తున్న భారీ సమగ్ర టెండర్‌ను వెంటనే రద్దు చేసి, కే టి పి ఎస్ కు ప్రత్యేక టెండర్ పిలవాలి
- టీజీ జెన్కో నిర్ణయంపై బీజేపీ జిల్లా నాయకులు పొనిశెట్టి వెంకటేశ్వర్లు



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 5,(ప్రజా జ్యోతి)** పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ కేటీపీఎస్ లో 10 సంవత్సరాలుగా యాష్ లిఫ్టింగ్, రవాణా పనులపై ఆధారపడి జీవిస్తున్న స్థానిక కాంట్రాక్టర్లు, వాహన యజమానులు, డ్రైవర్లు, కార్మికులు మరియు వారి కుటుంబాల ఉపాధిని దెబ్బతీసే విధంగా టీజీ జెన్కో తీసుకొచ్చిన కొత్త యాష్ టెండర్‌ను వెంటనే పునఃపరిశీలించాలని బీజేపీ జిల్లా నాయకులు పొనిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం పాల్వంచలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కే టి పి ఎస్ లో ఇప్పటివరకు అనేక మంది స్థానిక కాంట్రాక్టర్లు యాష్ లిఫ్టింగ్, రవాణా పనులు చేస్తూ ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నారని అన్నారు, అయితే ప్రస్తుతం టీజీ జెన్కో కేడీపీఎస్ తో పాటు కే టి పి పి, బి టి పి ఎస్ _వై టి పి ఎస్ నాలుగు థర్మల్ పవర్ ప్లాంట్ల యాష్‌ను కలిపి ఒకే భారీ కాంప్రహెన్సివ్ టెండర్ గా మూడు సంవత్సరాల కాలానికి అప్పగించేందుకు చర్యలు చేపట్టడం స్థానిక కాంట్రాక్టర్ల ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగిస్తుందని అన్నారు. ప్రస్తుత టెండర్‌లో నాలుగు ప్లాంట్ల నుంచి సంవత్సరానికి సుమారు 1,37,41,520 మెట్రిక్ టన్నుల యాష్, సుమారు ₹92 కోట్ల వార్షిక అంచనా విలువతో టెండర్‌కు తీసుకువచ్చార నీ, అంతేకాకుండా, టెండర్‌లో ₹300 కోట్ల వార్షిక టర్నోవర్, ₹100 కోట్ల నెట్‌వర్త్, కనీసం 100 టిప్పర్స్/ హైవే వాహనాలు, ఒకే థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి సంవత్సరానికి 20 లక్షల మెట్రిక్ టన్నుల నిర్వహించిన అనుభవం వంటి భారీ అర్హతలను విధించారు అన్నారు, స్థానికులకు అవకాశం లేకుండా భారీ సంస్థలకు మాత్రమే తలుపులు తెరవడం ఎందుకు అని ప్రశ్నించారు, ఈ నిబంధనల వల్ల కేటీపీఎస్ లో ఇంత కాలం యాష్ లిఫ్టింగ్ చేస్తున్న చిన్న, మధ్య తరహా స్థానిక కాంట్రాక్టర్లు టెండర్‌లో పాల్గొనే అవకాశం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని పొనిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. “ప్రభుత్వ రంగ సంస్థ అయినా టీజీ జెన్కో ఆదాయం పెంచుకోవడం, యాష్‌ను సమర్థవంతంగా వినియోగించడం తమకు అభ్యంతరం కాదు. కానీ నాలుగు ప్లాంట్లను ఒకే భారీ ప్యాకేజీగా ఏర్పాటు చేసి, వందల కోట్ల టర్నోవర్ , భారీ వాహన సామర్థ్యం వంటి అర్హతలు పెట్టడం ద్వారా స్థానికంగా సంవత్సరాలుగా ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న కాంట్రాక్టర్లందరినీ బయటకు నెట్టడం సరైన న్యాయం కాదు” అని అన్నారు. కేటీపీఎస్ ను ప్రత్యేక ప్యాకేజీగా ఎందుకు పెట్టకూడదు అని అన్నారు, నాలుగు ప్లాంట్లను ఒకే టెండర్‌గా ఇవ్వాల్సిన అవసరం ఏమిటో టీజీ జెన్కో స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేటీపీఎస్ ను ప్రత్యేక టెండర్‌గా, లేదా అవసరమైతే వేర్వేరు లాట్లుగా విభజించి టెండర్ నిర్వహిస్తే పెద్ద సంస్థలతో పాటు అర్హత కలిగిన స్థానిక కాంట్రాక్టర్లు కూడా పోటీలో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇలా చేయడం వల్ల టీజీ జెన్కోకు వచ్చే ఆదాయానికి నష్టం ఉండదని, పైగా పోటీ పెరిగి పారదర్శకమైన టెండర్ విధానం ఏర్పడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు, ఆర్టికల్ 14 స్ఫూర్తికి అనుగుణంగా పారదర్శకత ఉండాలన్నారు, ప్రభుత్వ సంస్థలు టెండర్లు పిలిచే అధికారం కలిగి ఉన్నప్పటికీ, టెండర్ నిబంధనలు ఏకపక్షంగా, లేదా అనవసరంగా పోటీని పరిమితం చేసే విధంగా ఉండకూడదని అన్నారు. స్థానిక కాంట్రాక్టర్లకు సమానమైన , న్యాయమైన పోటీ అవకాశం కల్పించడం ద్వారా పారదర్శకత, సమానత్వం, ప్రజా ప్రయోజనం కాపాడాలని కోరారు. టెండర్‌లో తెలంగాణ రాష్ట్రంలోని యూజర్ ఏజెన్సీస్కు ప్రాధాన్యత ఇవ్వాలని కూడా నిబంధనలో పేర్కొన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేటీపీఎస్ నుండి వచ్చే బూడిద , పొగ కాలుష్యంను అనుభవించేది స్థానికులు బూడిద అమ్ముకోవడానికి మాత్రం ఇతరుల పేరు మీద ఈ ప్రభుత్వం లోని పెద్దలే బినామీల రూపం లో ఈ బూడిద టెండర్ ను దక్కించుకోనున్నారు అని అన్నారు, కేటీపీఎస్ ను కే టి పి పి ,బి టి పి ఎస్, వై టి పి ఎస్ ,ల నుంచి ప్రత్యేకంగా విడదీసి టెండర్ చేయాల నీ, అవసరమైతే కేటీపీఎస్ ఫ్యాషన్ ను మల్టీప్లై లోట్స్ విభజించాల నీ, ₹300 కోట్ల టర్నోవర్, ₹100 కోట్ల నెట్‌వర్త్, 100 వాహనాలు, 20 లక్షల మెట్రిక్ టన్నుల అనుభవం వంటి అర్హతలను పునఃసమీక్షించాల నీ, అర్హత కలిగిన స్థానిక చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లందరికీ సమానమైన పోటీ అవకాశం కల్పించాలని, స్థానిక కాంట్రాక్టర్ల ఉపాధిపై టెండర్ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, కాంట్రాక్టర్ల అభ్యంతరాలను పరిష్కరించే వరకు కేటీపీఎస్ కు సంబంధించిన టెండర్‌ను ఫైనలైజ్ చేయరాదని, నాలుగు ప్లాంట్లను ఒకే ప్యాకేజీగా కలపడానికి గల సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా కారణాలను బహిర్గతం చేయాలన్నారు, కేటీపీఎస్ కేవలం ఒక విద్యుత్ ఉత్పత్తి కేంద్రం మాత్రమే కాదు. దాని చుట్టూ వేలాది కుటుంబాల జీవనోపాధి ముడిపడి ఉందనీ, కాంట్రాక్టర్లు, వాహన యజమానులు, డ్రైవర్లు, హమాలీలు, కార్మికులు, చిన్న వ్యాపారులు ఇలా అనేక వర్గాలు కేటీపీఎస్ కార్యకలాపాలపై ఆధారపడి ఉన్నాయనీ, వారందరి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని టీజీ జెన్కో టెండర్ విధానాన్ని పునఃపరిశీలించాల నీ. స్థానికుల ఉపాధిని దెబ్బతీసే విధంగా ఏకపక్ష నిర్ణయం తీసుకుంటే ప్రజల తరఫున న్యాయపరమైన పోరాటానికి కూడా సిద్ధంగా ఉంటాం” అని పొనిశెట్టి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో లారీ యూనియన్ ప్రధాన కార్యదర్శి పానుగంటి నరేష్ గౌడ్ ,ఉపాధ్యక్షులు గొనె వెంకన్న , యాష్‌కాంట్రాక్టర్ లు శాంపురి నాగేంద్రబు,భట్టు రవి,భట్టు మధు,భట్టు కృష్ణ,మొగిలి కిషోర్, మాలోత్ ప్రశాంత్,శాంపురి పవన్ లు పాల్గొన్నారు

## మెండికుంట అటవీ ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం...







- ఇద్దరికి తీవ్ర గాయాలు...
- సాయిబాబా గుడి సమీపంలో ద్విచక్ర వాహనం బోల్తా...
- క్షతగాత్రులను భద్రాచలం ఆసుపత్రికి తరలింపు...

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. / అశ్వాపురం సెప్టెంబర్ 05(ప్రజా జ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మెండికుంట అటవీ ప్రాంతంలో శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సాయిబాబా గుడి సమీపంలో పల్సర్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. ఇది సెల్ఫ్ యాక్సిడెంట్ గా స్థానికులు భావిస్తున్నారు. వెంటనే 108 అంబులెన్స్ కు సమాచారం అందించడంతో క్షతగాత్రులను భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అటవీ ప్రాంతం కావడంతో రోడ్డుపై జారి పడ్డారా..? లేక వాహనం అదుపు తప్పి ప్రమాదం జరిగిందా అని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జిల్లా ఉత్తమ ఎంఈఓగా పి.వి. రమణకు అవార్డు



**చర్ల, సెప్టెంబర్ 0 5 : ( ప్రజా జ్యోతి):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని చర్ల మండల విద్యాధికారి పి.వి. రమణకు జిల్లా ఉత్తమ ఏం ఈ ఓ పురస్కారం లభించింది. జిల్లా కేంద్రం కొత్తగూడెంలో శనివారం జరిగిన కార్యక్రమంలో కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. విద్యాశాఖలో 37 సంవత్సరాలుగా అంకితభావంతో సేవలందిస్తున్న పి.వి. రమణ చర్ల మండలంలో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మెరుగుదల, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు తదితర కార్యక్రమాల్లో కీలకంగా పనిచేశారు. ఆయన సేవలను గుర్తిస్తూ జిల్లా ఉత్తమ ఎంఈఓగా ఎంపిక చేశారు. చర్ల మండలంలోని పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు తెలంగాణ మోడల్ స్కూల్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ లో చర్ల మండలం జిల్లా స్థాయిలో రెండో స్థానం సాధించడంలో ఆయన నాయకత్వం వహించారు. పాఠశాలల్లో డిజిటల్ విద్యను ప్రోత్సహించడంతో పాటు ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు విధానాన్ని సమర్థవంతంగా అమలు చేశారు.అలాగే ‘బడిబాట’ వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచి, డ్రాపౌట్లను తగ్గించేందుకు కృషి చేశారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్థుల సహకారంతో మండలంలో విద్యాభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా పి.వి. రమణ మాట్లాడుతూ తనకు లభించిన ఈ పురస్కారం ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల సమిష్టి కృషికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానన్నారు. రాబోయే రోజుల్లో చర్ల మండలాన్ని విద్యారంగంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా ఉత్తమ ఎంఈఓగా పురస్కారం అందుకున్న పి.వి. రమణను మండల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు అభినందించారు.

# రాహుల్ విజ్ఞాన్ లో ఘనంగా టీచర్స్ డే వేడుకలు






**చర్ల, సెప్టెంబర్ 05:(ప్రజా జ్యోతి):** చర్ల మండల కేంద్రంలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ జి. వర్మరాజు, వైస్ ప్రిన్సిపల్ ఎం.వి.ఎల్. నరసింహారావు భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపల్ జి. వర్మరాజు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవ ప్రాముఖ్యతను, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రను వివరించారు. వైస్ ప్రిన్సిపల్ ఎం.వి.ఎల్.నరసింహారావుతో పాటు కొసరాజు హరిచరణ్, భారతి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు విలువైన సందేశాలను అందించారు.ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు తమ ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించి, వారిపై తమకున్న గౌరవాన్ని చాటుకున్నారు.విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ డి.ఎన్. కుమార్, డాక్టర్ ప్రతిభ, శాస్త్రి ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అనారోగ్య బాధిత కుటుంబానికి మేవా ఆపన్నహస్తం

- రూ.10 వేల ఆర్థికసాయం అందజేత



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి):** అనారోగ్యం, రోడ్డు ప్రమాదంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబానికి ముస్లిం ఎంపవర్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (మేవా) ఆపన్నహస్తం అందించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం మోతే గ్రామానికి చెందిన ఎస్కే జాకీరా బేగం కుటుంబానికి మేవా ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.మోతే గ్రామానికి చెందిన జాకీరా బేగం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇదే సమయంలో ఆమె భర్త ఎస్కే పాషా ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో కాలికి గాయాలు కావడంతో శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. ఒకవైపు భార్య అనారోగ్యానికి వైద్య ఖర్చులు, మరోవైపు భర్తకు శస్త్రచికిత్స, చికిత్సకు అయ్యే ఖర్చులు కుటుంబంపై తీవ్ర ఆర్థికభారాన్ని మోపాయి.కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే ఈ కుటుంబానికి వరుసగా ఎదురైన అనారోగ్య సమస్యలు ఆర్థిక ఇబ్బందులను మరింత పెంచాయి. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న మేవా ప్రతినిధులు స్పందించి తమ వంతు సహాయంగా రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మేవా ప్రతినిధులు మాట్లాడుతూ.. అనారోగ్యం, ఆపద సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. ఆపదలో ఉన్న వారికి తమ వంతు సహకారం అందించడం ద్వారా మానవతా విలువలను చాటవచ్చని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహకారం అందించేందుకు భవిష్యత్తులోనూ తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. జాకీరా బేగం, ఆమె భర్త ఎస్కే పాషా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మేవా అధ్యక్షుడు మహమ్మద్ ముస్తఫా, ప్రధాన కార్యదర్శి జహీర్ భాషా, సోహెల్ పాషా, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న తాటి వెంకటేశ్వర్లు



**దమ్మపేట, సెప్టెంబర్ 05, (ప్రజాజ్యోతి):** మండలంలోని ఎర్రగుంపు గ్రామంలో పొట్టా బాలకృష్ణ–కుమారి దంపతుల కుమార్తె కృష్ణకుమారి వివాహ వేడుకలకు అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు తాటి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వధువును ఆశీర్వదించి, నూతన వస్త్రాలను అందజేశారు. వధూవరుల కుటుంబ సభ్యులను పలకరించి, వివాహ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అంకంపాలెం సర్పంచ్ మోకాళ్ల గురుమూర్తి, పట్వారిగూడెం సర్పంచ్ కూరం అర్జున్‌రావు, తాటి రాము, పద్దం నగేష్, కారం చిన్నబాబు, రామారావు, పొట్టా వెంకటేష్, తాటి చంద్రం, తాటి సాయి, సోయం ముత్యాలరావు, కోర్స వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా బాలాజీ కళ్యాణం

- అన్నప్రసాద దాతలు దొడ్డ జనార్దన్ రెడ్డి, లలితాదేవి
- కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా వైభవంగా ఉట్టి కొట్టే కార్యక్రమం



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం ప్రాముఖ్యతను పురస్కరించుకొని ఆలయ మేనేజర్ శ్రీ పీవీ రమణ ఆదేశాల మేరకు ప్రతి శనివారం నిర్వహించే స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి కళ్యాణ మహోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా, కన్నులపండువగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. స్వామివారి కళ్యాణాన్ని దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా కిష్టారం గ్రామ వాస్తవ్యులు దొడ్డ జనార్దన్ రెడ్డి, లలితాదేవి దంపతులు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. అన్నప్రసాదం ఏర్పాటు చేసిన దాతలను ఆలయ నిర్వాహకులు అభినందించారు. అనంతరం కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా సాయంత్రం 5 గంటల నుంచి ఆలయం ముందు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో భక్తులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తుల సందడి మధ్య కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై సందడి చేశారు.

## ఉత్తమ పిజి హెచ్‌ఎం గా అవార్డు అందుకున్న పద్మ

- -ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితా రాణా చేతుల మీదుగా అవార్డు అందజేత



**ఇల్లందు, సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మండలంలోని రొంపేడు ఏజీహెచ్ఎస్ ఉత్తమ పీజీ హెచ్‌ఎం గా బి పద్మ ఎంపిక అయ్యారు. ఈ మేరకు శనివారం కొడంగల్ లో తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితా రాణా చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు రావడం తన విధులను మరింత పెంచిందని, ఇప్పుడు ఉత్సాహంతో విధుల పట్ల అంకితభావంతో పనిచేసే ప్రోత్సాహం లభించిందని రొంపేడు ఏజీహెచ్ఎస్ పీజీహెచ్‌ఎం బి పద్మ తెలిపారు

## రేపు అశ్వారావుపేటకు మంత్రి తుమ్మల

- పామాయిల్ మొక్కల పంపిణీ ప్రారంభం..
- ఫ్యాక్టరీ నిర్మాణ స్థల పరిశీలన



**దమ్మపేట, సెప్టెంబర్ 05, (ప్రజాజ్యోతి):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం అశ్వారావుపేటలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు అశ్వారావుపేటకు చేరుకోనున్న మంత్రి తుమ్మల పామాయిల్ డివిజన్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి పామాయిల్ రైతులకు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన పామాయిల్ రైతుల సమావేశంలో మంత్రి తుమ్మల పాల్గొని ప్రసంగించనున్నారు. పామాయిల్ సాగు విస్తరణ, రైతులకు అందుతున్న ప్రోత్సాహకాలు తదితర అంశాలపై మంత్రి రైతులతో మాట్లాడనున్నారు.తర్వాత ఆయిల్ ఫెడ్ అధికారులతో కలిసి పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని మంత్రి తుమ్మల పరిశీలించనున్నారు. ఫ్యాక్టరీ నిర్మాణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకోనున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## గురువులే భావి సమాజ నిర్మాతలు

విద్యాబోధనకే పరిమితం కాకుండా విలువలు, బాధ్యత, క్రమశిక్షణ నేర్పుతున్న ఉపాధ్యాయులు

**అశ్వాపురం, సెప్టెంబర్, 5, ప్రజాజ్యోతి** అశ్వాపురం: విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల తర్వాత అత్యంత కీలక పాత్ర పోషించేది ఉపాధ్యాయుడే. పుస్తకాల్లోని పాఠాలను బోధించడంతో పాటు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేలా, సమాజంలో బాధ్యతాయుతంగా మెలిగేలా, మంచి పౌరులుగా ఎదిగేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న గురువులు సమాజ నిర్మాణంలో కీలక భూమిక పోషిస్తున్నారు. అందుకే ఉపాధ్యాయులను భావి సమాజ నిర్మాతలుగా అభివర్ణిస్తారు.

**వ్యక్తిగత కష్టాలను పక్కనపెట్టి..**

ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం కాదు.. అది ఒక సామాజిక బాధ్యత. వ్యక్తిగత సమస్యలు, కుటుంబ బాధ్యతలు, అనారోగ్యం, ప్రయాణ ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విధులకు అంకితమవుతున్నారు. ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయులు రవాణా సౌకర్యాల కొరతను ఎదుర్కొంటూ, వర్షం, ఎండ, చలి వంటి ప్రతికూల పరిస్థితులను లెక్కచేయకుండా పాఠశాలలకు చేరుకుంటున్నారు. పాఠశాల సమయం ముగిసిన తర్వాత కూడా విద్యార్థుల ప్రగతిపై దృష్టి సారించడం, పాఠ్యాంశాలను సిద్ధం చేయడం, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా బోధించడం వంటి పనులకు అదనపు సమయాన్ని కేటాయిస్తున్నారు. తమ కుటుంబంతో గడపాల్సిన సమయాన్ని సైతం విద్యార్థుల కోసం వెచ్చిస్తున్న సందర్భాలు అనేకం. ఈ నిస్వార్థ సేవ, అంకితభావమే ఉపాధ్యాయుల త్యాగానికి నిదర్శనం.

**వెనుకబడిన విద్యార్థులకు అండగా..**

ప్రతి విద్యార్థి ప్రతిభ, ఆలోచనా విధానం, కుటుంబ పరిస్థితులు ఒకేలా ఉండవు. చదువులో ముందున్న వారితో పాటు వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో బోధించడం గురువుల బాధ్యతగా మారుతోంది. చదువుపై ఆసక్తి కోల్పోయిన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ వారిని ముందుకు నడిపిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమయ్యే పరిస్థితిలో ఉన్న విద్యార్థులకు ధైర్యం చెప్పడం, అవసరమైనప్పుడు తమవంతు సహాయం అందించడం, ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించడం వంటి సేవలను పలువురు ఉపాధ్యాయులు ఎలాంటి ప్రచారం లేకుండా చేస్తున్నారు. ఒక విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి సరైన దిశలో నడిపిస్తే అతని జీవితమే మారిపోతుంది. నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న అనేక మంది తమ విజయానికి తమ గురువులే కారణమని చెప్పవచ్చు